క్లుప్తంగా

పర్యావరణ రక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న రఘువరన్, మహిళలు

రాయికల్: పర్యావరణ రక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని డీఆర్డీవో రఘువరన్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మొక్కను నాటాలని, తద్వారా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మ ఉన్నారు.

రక్తనిల్వలు పెంచుకోవాలి



ప్రశంసపత్రాలు అందిస్తున్న మోహన్‌రెడ్డి

జగిత్యాల: రక్తనిల్వలు పెంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడతాయని సీనియర్ వైద్యులు, ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఐఎంఏలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం నిల్వలు పెంచుకోవడం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడిన వారమవుతామని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌కుమార్, అజయ్‌రెడ్డి, శ్రీపతి పాల్గొన్నారు.

బోధనాభ్యాసనలో లైబ్రరీ పుస్తకాలు ఉపయోగించాలి



మాట్లాడుతున్న మనోహరాచారి

కోరుట్ల: తెలుగు ఉపాధ్యాయులు బోధదానాభ్యాసనలో లైబ్రరీ పుస్తకాలను ఉపయోగించాలని రాష్ట్ర పరిశీలకుడు కటుకోజ్వల మనోహరాచారి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహరాచారి తెలుగు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు కృష్ణ మోహన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాషాసామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి



అధ్యాపక బృందం

మేడిపల్లి: విద్యార్థుల్లో కనీస భాషా సామర్థ్యాల పెంపునకు భాషోపాధ్యాయులు కృషి చేయాలని భీమారం మండల విద్యాధికారి వై.మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల భీమారంలో రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాల పాఠశాలలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజుల్లో విద్యార్థులు తెలుగును సరిగా చదవలేకపోతున్నారని, రాయలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ రాపర్తి సతీష్, బర్ల నారాయణ, రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన సాగర్ అనే గిరిజన యువకుడు ధర్మపురి అటవీ శాఖ ఎఫ్ఆర్వో శ్రీనాథ్‌పై ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం మెట్‌పల్లి డీఎస్పీ రాములు గ్రామంలో విచారణ చేపట్టారు. ఎఫ్ఆర్వో తన సిబ్బంది అటవీశాఖ భూమిని కబ్జా చేశావని, తన మామిడి తోటను, అందులో ఉన్న నిర్మాణాలను ధ్వంసం చేసి, తన హక్కులకు భంగం కలిగించాడని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ రాములు గ్రామంలో వాస్తవ విషయాలను తెలుసుకోవడానికి సాగర్‌తో పాటు, గ్రామస్తులను విచారించాడు. ఆయన వెంట బీర్‌పూర్ ఎస్సై రాజు ఉన్నారు.

చెట్ల నీడలో చదువులు

- తరగతి గదులకొరత
- సరిపోని బోరునీరు
- అటెండర్ పోస్టు ఖాళీ
- ఇబ్బందుల్లో విద్యార్థినులు



రాయికల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య లేక మూతపడుతున్న సమయంలో ఆ పాఠశాలలో మాత్రం విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద వరండాలో కూర్చుని విద్యాభ్యాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ పాఠశాలలో అటెండర్ పోస్టు సైతం ఖాళీగా ఉండటంతో విద్యార్థులే అటెండర్‌లాగా వ్యవహరించాల్సిన పరిస్థితి సైతం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే...

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉంది. ఇందులో 320 మంది విద్యార్థినులు ఉన్నారు. 10 సెక్షన్లకు గాను కేవలం 7 తరగతి గదులు మాత్రమే ఉండటంతో తరగతి గదుల కొరతతో విద్యార్థినులు చెట్ల కింద వరండాలో కూర్చోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇద్దరు హిందీ పండిట్‌లు ఉండాల్సి ఉండగా ఇటీవల సక్సెస్ స్కూల్‌కు కేటాయించిన హిందీ పండిట్ ఉపాధ్యాయున్ని డెప్యూటేషన్‌పై మరో పాఠశాలకు తరలించడంతో ఉన్న ఒకే ఒక్క ఉపాధ్యాయుడిపై తీవ్ర భారం పడుతుంది. అంతే కాకుండా ఆ పాఠశాలలో అటెండర్ పోస్టు సైతం ఖాళీగా ఉండటంతో విద్యార్థినులే తరగతి గదులను శుభ్రం చేసుకుంటున్నారు. విద్యార్థినులకు నీటి సౌకర్యం కోసం కేవలం ఒకే ఒక్క బోరు ఉండటంతో ఆ ఉన్న బోరు నుంచి సరిపడా నీరు రాకపోవడంతో విద్యార్థినులు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా క్రీడాకారుల కోసం క్రీడా స్థలం లేకపోవడంతో క్రీడాకారులు క్రీడలకు దూరమవుతున్నారు. ఉన్న తరగతి గదుల్లో సైతం చీకటిగా ఉండటంతో వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీపండిట్, అటెండర్ పోస్టు, తాగునీటి సౌకర్యం కోసం బోరును, తరగతి గదుల కొరతను తీర్చాలని కోరుతున్నారు.



చెట్ల నీడలో చదువుకుంటున్న విద్యార్థినులు

గదుల కొరత తీవ్రంగా ఉంది



మా పాఠశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉండటంతో వరండాలో కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తాగునీటి సౌకర్యం కోసం ఒకే ఒక్క బోరు ఉండటంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. అయినా మా సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు.

– గుమ్మడి అక్షర, పదో తరగతి విద్యార్థిని

ఉన్నతాధికారులకు నివేదించాం



రాయికల్‌లోని గర్ల్స్ హైస్కూల్‌లో తరగతి గదుల కొరత, హిందీ పండిట్, అటెండర్ పోస్టు, తాగునీటి సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే చర్యలు చేపడతాం. పాఠశాలలో తరగతి గదుల కొరతతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీర్చేందుకు కృషి చేస్తాం.

– రాఘవులు, హెచ్ఎం, ఎంఈవో

మల్లేశ్ హత్య కేసును పునర్విచారణ చేయాలి



బాధిత కుటుంబంతో హెచ్‌సీయూ ప్రొఫెసర్లు

వెల్గటూర్: ఈనెల 17న హత్యకు గురైన సల్లూరి మల్లేశ్ కేసును పునర్విచారణ చేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. మల్లేశ్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. మల్లేశ్ నుంచి ప్రేమపేరుతో రూ.20 లక్షలు దోచుకున్నారని, రాజిరెడ్డి, మల్లారెడ్డిపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నుంచి తప్పించుకునేందుకు మల్లేశ్‌ను హత్య చేశారని ఆరోపించారు. చంద్రయ్య అండదండలతో మల్లేశ్‌ను జులాయి, రౌడీగా చిత్రీకరించి రౌడీషీట్ ఓపెన్ చేయించారన్నారు. హత్యపై పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, కేవై.రత్నం, సీబీఐటీ కళాశాల ప్రొఫెసర్ స్వామిదాసు, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులను తప్పుదోవ పట్టించొద్దు'



వివరాలు తెలుసుకుంటున్న కృష్ణారావు

మల్లాపూర్: ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులను పంపిణీ చేస్తుంటే జీర్ణించుకోలేక ఎమ్మెల్యే సంజయ్ రైతులను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం ముత్యంపేటలో సొసైటీ చైర్మన్ తక్కళ్ల నరేశ్ రెడ్డితో కలిసి మాట్లాడారు. రైతులకు సరిపడా యూరియాను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంటే ఎమ్మెల్యే సంజయ్ ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియాను ఇస్తున్నారని ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఒక బస్తా యూరియా మాత్రమే ఇచ్చినట్లు ఎమ్మెల్యే సంజయ్ నిరూపించాలని, లేనిపక్షంలో ఆగస్టు 2న కోరుట్ల మండలంలోని ఐలాపూర్‌లో రైతువేదిక వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి భూమారెడ్డి, అల్లూరి మహేష్‌రెడ్డి, బొల్లం రఘు, ప్రకాష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటనక్కను చంపిన గ్రామస్తులు

మేడిపల్లి:కొన్ని రోజులుగా కమ్మరిపేట, భీమారం గ్రామాల్లో కోళ్లు, మూగజీవాలను చంపుతూ ప్రజలను భయపెడుతున్న ఓ గుంటనక్కను గ్రామస్తులు బుధవారం హతమార్చారు. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజిరెడ్డి ఇంట్లోకి బుధవారం చొరబడిన గుంటనక్క.. ఇంట్లో ఉన్న అతడిపై దాడి చేసింది. దారి వెంట వెళ్తున్న పలువురిని బయటపెట్టింది. చిన్నపిల్లలకు ప్రాణహానీ ఉంటుందని భావించిన గ్రామస్తులు దానికి కొట్టి చంపినట్లు సమాచారం.

వృద్ధురాలిపై కోతి దాడి

మల్యాల: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు ఎండీ.ఖాజాబీపై కోతి దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. బుధవారం ఖాజాబీ తన ఇంట్లో ఉండగా, కోతి తలపై దాడి చేసి, తీవ్రంగా గాయపర్చింది. స్థానిక మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, వైద్యురాలు మౌనిక ప్రాథమిక చికిత్స అందించి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యతో పాటు నైపుణ్యం పెంచుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యం పెంపొందించుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ నైపుణ్య విజ్ఞాన అభివృద్ధి సంస్థ (టాస్క్)పై ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, విద్యతో పాటునైపుణ్యాభివృద్ధి సాధించిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో టాస్క్ రీజినల్ మేనేజర్ గంగప్రసాద్, కో–ఆర్డినేటర్ నీరజ, మెంటర్ తిరుపతి, ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ధర్మపురి: వంద రోజుల యాక్షన్‌ప్లాన్ అమలులో భాగంగా స్థానిక 6వ, వార్డులో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ వైద్యులు అస్మా డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెంది అనేక వ్యాధులకు కారణమౌవుతాయని, దీనికి నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ గంగాధర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఎంవో వినయ్, సీహెచ్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందీ పండిట్ పోస్టులు భర్తీ చేయాలి

రాయికల్: పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పండిట్ పోస్టులను భర్తీ చేయాలని ఎంఈవో రాఘవులుకు హిందీ టీచర్లు బుధవారం వినతి పత్రం అందించారు. మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ సహాయ అధ్యక్షుడు వేల్పుల స్వామియాదవ్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, వసంతరావు, సయ్యద్‌పాషా, రాజేశం, శంకరయ్య, కూరగాయల సురేష్, రాజేశం, మారుతి పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ లో వంటగది నిర్మాణానికి అధికారులు, నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. వంటగది నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు గాంధారి శ్రీనివాస్, గడ్డం జీవన్‌రెడ్డి, ప్రతాప్, శాంతారాం, ప్రసాద్, రత్నాకర్, ప్రమోద్ పాల్గొన్నారు.

మారుతి నిలయం పరిశీలన



మారుతి నిలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మల్యాల: మండలంలోని ముత్యంపేటలోని శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో భక్తుల వసతి కోసం నిర్మించిన మారుతి నిలయం శిథిలావస్థకు చేరడంతో బుధవారం రోడ్లు, భవనాల శాఖ ఏఈ లహరి, ఏఈ నాగరాజుతో కలిసి పరిశీలించారు. భక్తుల వసతి సౌకర్యం కల్పించేందుకు మరో షెడ్డు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసి, భక్తుల వసతి సౌకర్యం కోసం 100 పడకల భవన నిర్మాణం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

మహా ధర్నాకు భారీగా తరలి వెళ్లాలి

కోరుట్ల: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆగస్టు 2న బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాకు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబురావు అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు.అబద్దపు హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు సరిగా లేక బోల్తాపడిన ట్రాక్టర్



బోల్తాపడిన ట్రాక్టర్

జగిత్యాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. బురదమయం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అచ్చుబండ పోచమ్మ ఆలయానికి వెళ్లే రహదారిలో ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై మొరం పోయించి చదును చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో జిల్లా ఉప వైద్యాధికారి

పెగడపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి సాధారణ వైద్య పరీక్షలు, బీపీ, మధుమేహ వైద్య పరీక్షలతో పాటు రక్త నమూనా సేకరించారు. దగ్గు, జలుబు, జ్వర పీడితులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు డెంగీ మలేరియా నిర్ధారణ పరీక్షలను చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాకేశ్, సంధ్య, హెడ్ నర్స్ ద్వారకా, కోఆర్డినేటర్ పద్మ, ఏఎన్ఎంలు శంకరమ్మ, చిలుకమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

పెగడపల్లి:ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనని విధుల పట్ల అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు ప్రజల్లో చిరకాలపు గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. పెగడపల్లి మండల పరిషత్‌లో ఎంపీవోగా పని చేసి బదిలీపై వెళ్లిన మహేందర్‌కు బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామానికి చెందిన కారపు చిరంజీవి అనారోగ్యంతో నెలరోజుల క్రితం మృతి చెందగా, బాధిత కుటుంబానికి తోటి మిత్రులు బుధవారం ఆర్థికసాయం అందించారు. 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు అందరూ కలిసి రూ. 66 వేలు చిరంజీవి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో తేలు లక్ష్మీనర్సయ్య, అనిల్, గంగుల శ్రీనివాస్, ధనుంజయ్, సుమలత, ఫారుక్ పాల్గొన్నారు.

నూతన బ్రేకర్లు ప్రారంభం

మేడిపల్లి: భీమారం మండల పరిధిలోని మన్నెగూడెం, వెంకట్రావుపేట, ఒడ్యాడ్ సబ్ స్టేషన్లలో రూ.15 లక్షల నిధులతో నూతన బ్రేకర్లు ప్రారంభించినట్లు జగిత్యాల ఎస్ఈ బొంకూరి సుదర్శనం తెలిపారు. కొంతకాలంగా సబ్‌స్టేషన్లలో ఒకే బ్రేకర్‌తో పనులు నడపడంతో ఇబ్బంది అయిందని, అందుకే నూతన బ్రేకర్లు అమర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈలు గంగారాం, మధుసూదన్, గోపి క్రిష్ణ, ఏడీఈలు రఘుపతి, రాజు, ఏఈ అశోక్, సబ్ ఇంజినీర్ హరిప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: సైన్స్ ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. విద్యార్థులు విశ్వతేజ, శ్రేయన్వి, ఇటీవల నిర్వహించిన గణిత ఒలంపియాడ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వారిని అభినందించారు.

ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇళ్ల నిర్మాణం ఉండాలి

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి, రంగపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నిబంధనలను వివరిస్తూ, హౌజింగ్ అధికారుల సూచనల మేరకే ఇళ్ల నిర్మాణం ఉంటేనే రూ. 5 లక్షల బిల్లుల చెల్లింపులు సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హౌజింగ్ అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనూష

రాయికల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని అనూష ఎంపికైనట్లు పీడీ కృష్ణప్రసాద్ బుధవారం తెలిపారు. జిల్లాస్థాయి అండర్–16 విభాగంలో షార్ట్‌పుట్‌లో ప్రథమస్థానం సాధించగా, ఆగస్టు 3,4 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా అనూషను హెచ్ఎం శ్రీనివాస్, నాయకులు అభినందించారు.

మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉదయ్

రాయికల్: మండల తహసీల్దార్ నాగార్జున నేటి నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు సెలవులో వెళ్లిన నేపథ్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఉదయ్‌కుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గుడిపేటలో కాంగ్రెస్ జెండావిష్కరణ



జెండావిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: పల్లె పల్లెకు కాంగ్రెస్ జెండా కార్యక్రమంలో భాగంగా బుధవారం మల్యాల మండలం గుడిపేటలో కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి, ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, శనిగరపు తిరుపతి,గొట్టే హన్మండ్లు, సంత ప్రకాశ్ రెడ్డి, గడి అనిల్, నాగులపేట సంజీవ్ పాల్గొన్నారు.

భర్త ఆచూకీ లభించడం లేదని భార్య ఫిర్యాదు

సారంగాపూర్: బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగేళ గ్రామానికి చెందిన వ్యక్తి రెండు రోజులుగా కనిపించడం లేదని ఆయన భార్య బుధవారం బీర్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగేళ గ్రామానికి చెందిన రామడుగు కొండయ్య (64) ఏళ్ల తన భర్త ఈ నెల 29న ఉదయం ఇంట్లోకి ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడని, బంధువులు తెలిసిన వాళ్ల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదని, ఆయన భార్య ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కొండయ్య ఆచూకీపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు రేషన్‌కార్డులు పంపిణీ

గొల్లపల్లి: మండల కేంద్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు గురువారం రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు. 1658 కొత్త రేషన్‌కార్డులు, 2631 సవరించిన రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. అనంతరం గొల్లపల్లి నుంచి మల్లన్నపేట వరకు, మల్లన్నపేట నుంచి జగిత్యాల వరకు నూతన బస్సును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

గొల్లపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. పాఠశాలలో కూడా 6,7 వ తరగతి వరకు స్పాట్ అడ్మిషన్లు తీసుకోనునట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్ మోటారు చోరీ

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలోని పంచతి బాలరాజు అనే రైతుకు చెందిన విద్యుత్ మోటారును గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గురువారం బాధిత రైతు తన పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా విద్యుత్ మోటారు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

బుగ్గారం/వెల్గటూర్/సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద రైతులకు రాయితీపై వివిధ రకాలైన యంత్ర పరికరాలు పంపిణీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బుగ్గారం,వెల్గటూర్,/సారంగాపూర్ మండలాల వ్యవసాయ అధికారులు అక్షిత,సాయికిరణ్,ప్రదీప్‌రెడ్డి, రాజుకుమార్ తెలిపారు. సన్న,చిన్నకారు,ఎస్సీ, ఎస్టీ,మహిళా రైతులకు 50 శాతం రాయితీపై అలాగే ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వీటిని అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు స్థానిక ఏఈవోలను గానీ, లేదా ఏవోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఫేస్ రికగ్నైజ్‌తో పింఛన్ల పంపిణీ సులభం



పింఛన్లు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో

ఇబ్రహీంపట్నం: ముఖచిత్రం యాప్‌లో నమోదు చేయగానే పింఛన్ల పంపిణీ సులభంగా చేయవచ్చని డీఆర్డీవో రఘువరన్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మక్కపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ముఖచిత్రం ద్వారా పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఇంతకుముందు వేలిముద్రల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడంతో ఐదు నిమిషాలు పట్టేదన్నారు. ముఖచిత్రం ద్వారా త్వరగా పింఛన్లు పంపిణీ చేయవచ్చన్నారు. మండలంలోని 8 గ్రామాల్లో 3,632 మందికి ముఖచిత్రం ద్వారా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శంకర్, ఏపీవో కొమురయ్య, కార్యదర్శి సరిత పాల్గొన్నారు.